సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

సోమవారం । 20 । జనవరి । 2025



జాగ్రత్తలే శ్రీరామరక్ష! - 8లో▸

యూట్యూబ్ వినియోగంలో జాగ్రత్తలు తీసుకోకపోతే పిల్లలపై దుష్ప్రభావం పడే వీలుంది. అదేపనిగా యూట్యూబ్ చూస్తుంటే నియంత్రించే చర్యలేంటో తెలుసుకుందాం.



మేడారం మినీ జాతరకు సిద్ధం

వచ్చే నెలలో మేడారం మినీ జాతరను వైభవంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేస్తున్నామని మంత్రి సీతక్క అన్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
$29^0/15^0$

వాతావరణం

ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి సమయంలో మంచు కురుస్తుంది. చలి తీవ్రత మరింత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేటి వరంగల్, హనుమకొండ గ్రీవెన్స్‌లు రద్దు

వరంగల్/హన్మకొండ:వరంగల్, హనుమకొండ కలెక్టరేట్లలో సోమవారం(నేడు) నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాలను పరిపాలనా పరమైన కారణాలతో రద్దు చేస్తున్నట్లు కలెక్టర్లు డాక్టర్ సత్యశారద, పి.ప్రావీణ్య వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. రైతు భరోసా, నూతన రేషన్ కార్డుల సర్వేలో అధికారులు నిమగ్నమై ఉన్నందున ఈనిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈవిషయాన్ని ప్రజలు గమనించి అర్జీలు ఇవ్వడానికి కార్యాలయాలకు రావొద్దని కోరారు.

నేడు గ్రేటర్ గ్రీవెన్స్

వరంగల్ అర్బన్ : వరంగల్ మహా నగరపాలక సంస్థ(జీడబ్ల్యూఎంసీ)లో సోమవారం(నేడు) గ్రేటర్ గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం వరకు రాత పూర్వకంగా దరఖాస్తులు స్వీకరిస్తామని, సమస్యల పరిష్కారానికి ఈ వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

22 నుంచి విద్యార్థులకు పోటీలు

విద్యారణ్యపురి: విద్యార్థులకు రోడ్డుభద్రతపై అవగాహన కల్పించేందుకు ఈనెల 22 నుంచి 24 వరకు వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు హనుమకొండ డీఈఓ వాసంతి ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ రోడ్డు భద్రతా మాసాన్ని పురస్కరించుకుని ఉపన్యాస, వ్యాస రచన, క్విజ్, డ్రామా పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జూనియర్స్ విభాగంలో 5 నుంచి 7వ తరగతి వరకు, సీనియర్స్ విభాగంలో 8 నుంచి పదో తరగతి విద్యార్థులకు పోటీలుంటాయని తెలిపారు. ఈనెల 22న పాఠశాల స్థాయిలో హెచ్ఎంలు పోటీలు నిర్వహించుకుని అందులో విజేతలను మండల స్థాయి పోటీలకు పంపాలన్నారు. 23న మండల స్థాయిలో పోటీలు నిర్వహించి విజేతలను ఈనెల 24న హనుమకొండలోని లష్కర్‌బజార్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. జిల్లా స్థాయిలో విజేతలకు గణతంత్ర దినోత్సవం రోజున కలెక్టర్ చేతుల మీదుగా జ్ఞాపికలు, ప్రశంసపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. పోటీల నిర్వహణకు సంబంధించి ఏమైనా సందేహాలుంటే అలిగిరెడ్డి మధుసూదన్‌రెడ్డిని 98498 34110 నంబర్‌లో సంప్రదించాలని జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్ కోరారు.

నిట్‌లో సైన్స్ కమ్యూనికేషన్ వర్క్‌షాప్



కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లోని విశ్వేశ్వరయ్య స్కిల్ డెవలప్‌మెంట్ భవనంలో ఆదివారం తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్స్, జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యాన స్కూల్ టీచర్స్‌కు ఒక్క రోజు సైన్స్ వర్క్‌షాప్ నిర్వహించారు. 'గో గ్రీన్, బ్రీత్‌క్లీన్, ద బిల్డింగ్ బ్లాక్స్ ఆఫ్ లైఫ్' అనే అంశంపై నిట్ ప్రొఫెసర్ రామరాజు ఉపాధ్యాయులతో మాట్లాడారు. కార్యక్రమంలో నిట్ ప్రొఫెసర్ ఆంజనేయులు, రాములు, జేవీవీ కమిటీ సభ్యులు కేబీ.ధర్మప్రకాశ్, కాజీపేట పురుషోత్తం, రామంచ భిక్షపతి, పరికిపండ్ల వేణు, సుమలత పాల్గొన్నారు.

నేడు, రేపు నిట్‌లో లైబ్రేరియన్ల సమావేశం

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్ సెంట్రల్ లైబ్రరీ ఆధ్వర్యాన సోమవారం, మంగళవారాల్లో లైబ్రేరియన్లు, పబ్లిషర్స్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సమావేశం చైర్‌పర్సన్, కెమికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ ఆనంద్‌కిషోర్ కోలా ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా తెలంగాణ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఎండీ.రియాజ్, కేయూ వీసీ కె.ప్రతాప్‌రెడ్డి, నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ పాల్గొంటారని పేర్కొన్నారు.

జేఎన్ శర్మకు రోటరీ ఎక్స్‌లెన్స్ అవార్డు




హన్మకొండ కల్చరల్: వరంగల్‌కు చెందిన సీనియర్ రంగస్థల నటులు, పోతన విజ్ఞాన పీఠం మేనేజర్ జేఎన్ శర్మ 'రోటరీ ఎక్స్‌లెన్స్' అవార్డు అందుకున్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వరంగల్‌లోని క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో క్లబ్ పూర్వ అధ్యక్షులు రమేశ్, మోహన్‌రావు చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. కళారంగంలో అత్యుత్తమ సేవలు అందించినందుకుగాను ఈఅవార్డు లభించింది. అదేవిధంగా హనుమకొండలోని ల్యాండ్ మార్క్ హోటల్‌లో నిర్వహించిన ఏవీవీ జూనియర్ కాలేజ్ (1973–75) పూర్వవిద్యార్థులు డాక్టర్ నర్సింహారెడ్డి, దిగంబర్, పెద్ది ప్రభాకర్ జేఎన్ శర్మను ఘనంగా సన్మానించారు.

రోడ్డు మీద రోడ్డు

ప్యాచ్‌వర్క్ స్థానంలో ఏకంగా సీసీ వేశారు

- కార్పొరేటర్ల సేవలో కార్పొరేషన్ ఇంజనీర్లు
- పర్సంటేజీల కోసం అధికారుల కక్కుర్తి
- వృథా అవుతున్న ప్రజాధనం



పక్క ఫొటోలో కనిపిస్తున్నది వరంగల్ దుర్గేశ్వరాలయ వీధి. ఇక్కడ సీసీ రోడ్డు నాలుగేళ్ల క్రితం వేశారు. పదేళ్ల పాటు నాణ్యతగా ఉండాల్సిన రోడ్డు ఆర్నెళ్లకే సీసీ కొట్టుకుపోయింది. మరమ్మతు చేస్తే సరిపోతుంది. కానీ.. మళ్లీ రూ.15 లక్షలు వెచ్చించి కొత్తగా సీసీ రోడ్డు నిర్మించారు.

.. ఇలా నగరంలోని కాలనీల్లో రాత్రికి రాత్రే రెడీమిక్స్ వాహనాలతో మెటీరియల్ తీసుకొచ్చి సీసీ రోడ్డు మీద సీసీ రోడ్డు వేసేస్తున్నారు. నాణ్యతా ప్రమాణాలు గాలికి వదిలేసి 'నీకింత, నాకెంత' అంటూ ఇంజినీర్లు, కాంట్రాక్టర్లు ప్రజాధనాన్ని పంచుకుంటున్నారు.

వరంగల్ అర్బన్: ప్రజాప్రతినిధులు సిఫారసు చేసిందే తడవు.. ఆగమేఘాలపై అంచనాలు తయారు చేస్తున్నారు బల్దియా ఇంజినీర్లు. అక్కడ పని అవసరం ఉందా? లేదా? అనే విషయం వారికి అవసరంలేదు. ఆ తర్వాత పనులు పూర్తయ్యాయా? లేదా? అన్నది పట్టించుకోరు. టెండర్ పిలవకపోయినా.. కాంట్రాక్టర్లతో జరిగిన ఒప్పందం మేరకు పనులు ప్రారంభించకపోయినా.. వీరెవరూ వాటి జోలికి వెళ్లరు. ఒక ఏరియా నుంచి మరో ఏరియాకు ఇంజినీర్లు బదిలీ అయ్యారంటే ఆ పనుల సంగతి అంతే. ఆయా దస్త్రాలన్నీ మూలకు చేరుతున్నాయి. బల్దియా పరిధిలో నెలరోజుల వ్యవధిలో రూ.19.18 కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయి. గతంలో రోడ్డు వాస్తవ విస్తరణ, కూల్చివేతలు పొడవు, వెడల్పు చేసుకొని పనులు చేపట్టారు. కానీ, గత మూడు నెలలుగా అవేమీ కనిపించడం లేదు.

ప్రణాళికా లోపం

ఏదైనా ఒక పని కోసం అంచనాలు వేసి టెండర్లు పిలిచే ముందు ఇంజినీర్లు క్షేత్ర స్థాయిలో పరిశీలించాలి. అక్కడ పని అవసరం ఉందా? ఉంటే.. దానిపై ఏమైనా వివాదాలున్నాయా? వంటి ప్రాథమిక అంశాలను తెలుసుకున్నాకే రంగంలోకి దిగాలి. బల్దియాలో ఇంజినీర్లు ప్రజాప్రతినిధుల సిఫారసులకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నారు. ఆపై క్షేత్రస్థాయిలోని ఉద్యోగులకు ఇచ్చే సమాచారం ఆధారంగా అంచనాలు, ఆమోదం, అనుమతులు, బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయి. ఒకవేళ కమిషనర్ తనిఖీ చేసినా.. వివిధ రకాల కారణాలతో ఇంజినీర్లు, కాంట్రాక్టర్లు తప్పుదోవ పట్టిస్తున్నారు. దీంతో రూ.వందల కోట్ల ప్రజాధనం దుర్వినియోగమవుతోంది. పట్టించుకునే వారు లేక బల్దియా పరిపాలన అస్తవ్యస్తంగా.. ఆగమాగంగా.. అవినీతి మయంగా మారింది.

పరిపాలన అధోగతి..

బల్దియా మంజూరు చేసిన పనులను పరిశీలిస్తే ఇంజినీర్ల నిర్లక్ష్యం కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది. తగిన పరిశీలన లేకుండా రూ.కోట్ల విలువైన టెండర్లు పిలవడంతో ఈపనులు ఇష్టానుసారంగా కొనసాగుతున్నాయి. ఏదో ఒక డివిజన్, కాలనీలో కాదు.. ఇలా అన్ని డివిజన్లలోనూ ఇదే పరిస్థితి. కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, మేయర్ గుండు సుధారాణి ఇటీవల డివిజన్ పర్యటనకు వెళ్లిన క్రమంలో వివిధ సమస్యల్ని ప్రజలు వారి దృష్టికి తీసుకొచ్చారు.

థర్డ్ పార్టీ పరిశీలిస్తోంది..



సీసీ రోడ్లు, కల్వర్టు నిర్మాణాలపై థర్డ్ పార్టీ నాణ్యతా ప్రమాణాలను పరిశీలిస్తోంది. లోపాలుంటే బిల్లుల్లో కోత పెడుతున్నాం. రోడ్లు దెబ్బతినడం వల్ల మళ్లీ సీసీ రోడ్లు నిర్మిస్తున్నాం.

- ప్రవీణ్ చంద్ర, బల్దియా ఎస్ఈ

క్రీడాకారులకు ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీ అందజేస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా



ఓవరాల్ చాంపియన్

సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగం

- ముగిసిన పోలీస్ క్రీడలు

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధి పోలీసులకు మూడు రోజులుగా నిర్వహిస్తున్న పోలీస్ క్రీడలు ఆదివారం ముగిశాయి. వార్షిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్–2025లో సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగం 125 పతకాలు గెలుచుకుని ఓవరాల్ చాంపియన్ షిప్ కైవసం చేసుకుంది. ఈస్ట్‌జోన్ 51, సెంట్రల్ జోన్ 50, వెస్ట్‌జోన్ 19, ఇతర విభాగాల జట్లు 21 పతకాలను గెలుచుకున్నాయి. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ జట్టు, డీసీపీ అధికారుల జట్లకు మధ్య టగ్ ఆఫ్ వార్ పోటీ నిర్వహించగా సీపీ జట్టు విజయం సాధించింది. అనంతరం విజేతలకు సీపీ అంబర్ కిశోర్‌ఝా చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నిరంతరం విధినిర్వహణలో ఉండే పోలీసులకు ఈ క్రీడలు ఉల్లాసాన్ని కలిగించాయన్నారు. క్రీడలతో దేహ దారుఢ్యంతోపాటు, అనారోగ్య సమస్యలు దరిచేరవని చెప్పారు. కమిషనరేట్ పోలీస్ క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబర్చి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు షేక్ సలీమా, రాజమహేంద్రనాయక్, రవీందర్, అదనపు డీసీపీలు రవి, సురేశ్‌కుమార్, ఏఎస్పీ చేతన్‌తో పాటు ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



టగ్ ఆఫ్ వార్ పోటీలో తలపడుతున్న సీపీ, డీసీపీ జట్లు

తర్వాత ఎవరు?



రిజిస్ట్రేషన్ శాఖలో 'సస్పెన్షన్' దడ

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో చర్చ
- బదిలీ అయినా తీరు మార్చుకోని కొందరు

కాజీపేట అర్బన్: వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న రామచంద్రయ్యపై శుక్రవారం సస్పెన్షన్ వేటు పడింది. దీంతో రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ శాఖలో పని చేస్తున్న సబ్ రిజిస్ట్రార్లకు తామూ సస్పెండ్ అవుతామనే భయం పట్టుకుంది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సొంత జిల్లాలో అక్రమ రిజిస్ట్రేషన్లు, అవినీతికి పాల్పడిన ఘటనతో సస్పెన్షన్ వేటు పడగా.. ఇన్‌చార్జ్ మంత్రిగా వ్యవహరిస్తున్న వరంగల్‌లో అక్రమాలకు పాల్పడుతున్న సబ్ రిజిస్ట్రార్లపై వేటు పడక తప్పదంటూ జంకుతున్నారు. నాన్ లేఔట్‌లతో పాటు నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లకు పాల్పడుతున్న ఉమ్మడి వరంగల్ జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

మారని తీరు..

గతేడాది జూలై 31న రిజిస్ట్రేషన్స్, స్టాంప్స్ శాఖలో అవినీతి, అక్రమాలను నిర్మూలించేందుకు జీరో ట్రాన్స్‌ఫర్స్ పేరిట అటెండర్ స్థాయి నుంచి జిల్లా రిజిస్ట్రార్ స్థాయి వరకు బదిలీలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. కాగా.. ఆగస్టులో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, సబ్ రిజిస్ట్రార్లు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు.. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన వారు ఉమ్మడి వరంగల్‌లో విధుల్లో చేరారు. కాగా.. వరంగల్ డీఐజీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న తరుణంలోనే రామచంద్రయ్య ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా వరంగల్ ఆర్వోలో అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడడంతో సస్పెండ్‌కు గురయ్యారు.. కాగా.. బదిలీ అయ్యి వైరాలో సబ్ రిజిస్ట్రార్‌గా చేరి.. తీరు మార్చుకోకపోవడంతో శుక్రవారం మరోసారి సస్పెండ్ అయ్యారు. బదిలీల్లో భాగంగా వరంగల్ ఆర్వోలో విధులు నిర్వహిస్తున్న జాయింట్–2 సబ్ రిజిస్ట్రార్ తొలుత స్టేషన్‌ఘన్‌పూర్‌కు బదిలీ కాగా.. జోన్‌లో భాగంగా మళ్లీ జనగామకు బదిలీ అయ్యారు. విజిలెన్స్ అధికారులు సదరు సబ్ రిజిస్ట్రార్‌పై ఆరా తీస్తున్నారనే సమాచారంతో మరో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి బదిలీ ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఈసారి ఏకంగా ఖమ్మం, వరంగల్ కాకుండా మరో జిల్లాకు బదిలీ అయ్యేందుకు పక్కా ప్లాన్ చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఉమ్మడి జిల్లాలో సస్పెన్షన్స్ ఇలా..

వరంగల్ ఆర్వో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో జాయింట్–2 సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న సురేంద్రబాబు 2021లో అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడినట్లు విచారణలో తేలడంతో సస్పెన్షన్‌కు గురయ్యారు. అదే ఏడాది జాయింట్–1 స్థాయి సబ్ రిజిస్ట్రార్‌గా సంపత్‌కుమార్, ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా రామచంద్రయ్య రెండు నెలల వ్యవధిలో ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ అక్రమ రిజిస్ట్రేషన్ల నేపథ్యంలో సస్పెన్షన్‌కు గురయ్యారు. కాగా.. 2024లో వరంగల్ ఫోర్ట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించిన రాజేశ్ అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడడంతో ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.

నోటీస్ అందజేశాం..

వరంగల్ ఆర్వో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న జాయింట్–2 సబ్ రిజిస్ట్రార్‌పై ఇటీవల అవినీతి, అక్రమ రిజిస్ట్రేషన్లపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టాం. నివేదిక ఆధారంగా డీఐజీ సదరు అధికారికి నోటీస్ అందజేశారు.

- ఫణీంధర్, జిల్లా రిజిస్ట్రార్, వరంగల్

టీచర్లు, లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి కృషి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రవీందర్

కేయూ క్యాంపస్: టీచర్ల, లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్ అన్నారు. జాక్టో మద్దతుతో తాను ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికల బరిలో ఉండబోతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆదివారం కాకతీయ యూనివర్సిటీతోపాటు గోపాల్‌పూర్‌లో వాకర్స్‌ను కలిసి మాట్లాడారు. ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో తాను ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఆరేళ్ల పలు సమస్యలను పరిష్కరించానని గుర్తు చేశారు. ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణ వయసు 61 ఏళ్ల వరకు, తెలంగాణలో మొదటి పీఆర్సీ 30 శాతం ఫిట్‌మెంట్ సాధన, సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్ సాధించినట్లు తెలిపారు. కేజీబీవీ ఉపాధ్యాయినులకు 180 రోజుల మెటర్నిటీ సెలవు సౌకర్యం వంటివి సాధించినట్లు వివరించారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాను ఓటమి చెందినప్పటికీ ఆరేళ్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక సమాజంలో ఉంటూ.. వారి సమస్యలపై పోరాటాలకు మద్దతుగా నిలిచానన్నారు. 317 జీఓ బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఈ ఏడాది మార్చిలో జరగబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి డాక్టర్ ఆట సదయ్య, రాష్ట్ర బాధ్యులు రవి, సుధాకర్‌రెడ్డి, రమేశ్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కె.రాంబాబు, ప్రధాన కార్యదర్శి వి.రాంబాబు, వరంగల్, ములుగు, భూపాలపల్లి బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.



కేయూలో ప్రచారం చేస్తున్న పూల రవీందర్

వినతి సమర్పయామి!

- ఐనవోలు మండలం నుంచి వచ్చిన సక్సేషనల్ ఫైల్ ఆర్డీఓ ఆఫీస్‌లో కనిపించకుండా పోయింది. బాధితుడు ఎన్నిసార్లు తిరిగినా కనీస సమాచారం ఇచ్చేవారు లేరు. ఇదే ఫైల్ మూడుసార్లు ఐనవోలు తహసీల్దార్ ఆర్డీఓ ఆఫీస్‌కు పంపాల్సి వచ్చింది.
- హసన్‌పర్తి మండలంలో ఓ మహిళ సక్సేషన్ కోసం దరఖాస్తు చేసుకుంటే నాలుగు సార్లు ధరణిలో రిజెక్ట్ చేశారు. సంవత్సర కాలంగా తిరుగుతున్నా ఎందుకు తిరస్కరించారో చెప్పలేదు. చివరకు కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు వచ్చాక అసలు సమస్య వివరించి మరోసారి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రజావాణి అర్జీలపై నిర్లక్ష్యం

- కలెక్టర్ ఆదేశించినా ఫలితం శూన్యం
- వందల సంఖ్యలో పెండింగ్ దరఖాస్తులు
- అత్యధికంగా భూ సంబంధ సమస్యలే..
- కనిపించకుండా పోతున్న ధరణి ఫైళ్లు
- పలు శాఖల తీరుపై విమర్శల వెల్లువ



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్(ఫైల్)

హన్మకొండ అర్బన్:

ప్రజాసమస్యల తక్షణ పరిష్కారమే 'ప్రజావాణి' ధ్యేయం. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏకంగా రాష్ట్ర రాజధానిలోనే ప్రజాదర్బార్ పేరుతో ఏర్పాటు చేసింది. సాధ్యమైన సమస్యలకు తక్షణ పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో జిల్లా కేంద్రాల్లో ప్రతీ సోమవారం నిర్వహించే 'గ్రీవెన్స్'కు అధికారులు జవాబుదారీగా ఉండాలని స్పష్టం చేసింది. అయితే కొందరు అధికారుల నిర్లక్ష్యం కారణంగా సర్కారు లక్ష్యం నీరుగారిపోతోంది. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలి.. ఏ చర్యలు తీసుకున్నారో దరఖాస్తుదారులకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. కానీ క్షేత్రస్థాయిలో అమలు కావడంలేదు. ముఖ్యంగా కలెక్టర్ చెప్పినప్పుడు 'ఓకే.. మేడం' అంటున్నారు.. తరువాత పట్టించుకోవడంలేదు. ఇందుకు జిల్లా పరిధి 14 మండలాలు, రెండు ఆర్డీఓ కార్యాలయాలు, కలెక్టరేట్‌లోని వివిధ సెక్షన్లు కలిపి పెండింగ్‌లో ఉన్న 1,200 దరఖాస్తులే నిదర్శనం.

రెవెన్యూ నిర్లక్ష్యం..

కలెక్టరేట్ ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే దరఖాస్తుల్లో రెవెన్యూ శాఖకు ప్రధానంగా భూ సంబంధమైనవే అధికంగా ఉంటున్నాయి. వీటిలో ధరణి ఫిర్యాదులు, వినతులను అధికారులు చిన్నచిన్న సాంకేతిక కారణాలు సాకుగా చూపి ఏళ్ల తరబడి పెండింగ్‌లో పెడుతున్నారు. ఒక వేళ ధరణి ద్వారా దరఖాస్తు చేసినా ఆ పని చట్టపరంగా చేయలేనప్పుడు.. సాంకేతిక ఇబ్బందులు ఉన్నప్పుడు.. దాన్ని ఆన్‌లైన్‌లో తిరస్కరించి అదే సమాచారం అర్జీదారులకు చెపితే సరిపోతుంది. కానీ అధికారులు ఆవిషయం చెప్పరు. దరఖాస్తు ఎక్కడ ఉన్నది.. ఏం జరుగుతున్నది చెప్పకపోవడంతో ఆందోళన అధికమై కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఇక హనుమకొండ ఆర్డీఓ కార్యాలయంలో ఏడాది కాలంగా పెండింగ్ పడిన ధరణి ఫైళ్లు కనిపించకుండా పోయినవి లెక్కకు మించి ఉన్నాయి.

అధిక సంఖ్యలో అర్జీలు పెండింగ్ ఉన్న శాఖలు, కార్యాలయాల వివరాలు

శాఖ	దరఖాస్తులు	పరిష్కారం	పెండింగ్
జీడబ్ల్యూఎంసీ	4358	3592	766
సీపీ, వరంగల్	528	224	304
కలెక్టరేట్ డీ సెక్షన్	677	146	531
కలెక్టరేట్ ఈ సెక్షన్	315	83	232
ఆర్‌ఈహెచ్, వరంగల్	914	779	135
తహసీల్దార్ హసన్‌పర్తి	1204	1098	106
తహసీల్దార్, ఆత్మకూరు	169	65	104
తహసీల్దార్, కాజీపేట	948	737	211
తహసీల్దార్, పరకాల	148	51	97
డీఆర్ఓ(సెక్షన్లు)	129	63	66
స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్	49	05	44
'కుడా', వీసీ	150	09	141

డిజిటల్ సైన్ కోసం రెండేళ్లుగా..



గ్రామంలోని 182/సీ/2 సర్వే నంబర్‌లో మాకు భూమి ఉంది. పట్టా పాస్ పుస్తకం ఉన్నది. 1.06 ఎకరాల భూమికి సంబంధించి డిజిటల్ సైన్ కానట్లు ఆన్‌లైన్‌లో చూపెడుతోంది. రెండేళ్లుగా హసన్‌పర్తి తహసీల్దార్, కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో వినతులు ఇస్తున్నాం. కలెక్టరేట్‌లో ఇస్తే తహసీల్దార్‌కు పంపుతున్నారు. అక్కడ పెండింగ్‌లోనే పెడుతున్నారు. ప్రతీ సోమవారం వచ్చి ఫిర్యాదులు ఇస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదు.

- తాళ్లపెల్లి మొగిలి దంపతులు, పెంబర్తి(హసన్‌పర్తి)

30 సార్లు ఫిర్యాదు చేశా..



గ్రామంలోని 194 సర్వే నంబర్లో నాకు వారసత్వంగా వచ్చిన ఎకరం 24 గుంటల భూమి ఉంది. నేను కాస్తు చేసుకుంటున్న ఆ భూమికి సంబంధించి సాదాబైనామా ద్వారా తహసీల్దార్ నుంచి తెలంగాణ పాస్ పుస్తకం పొందాను. ప్రస్తుతం భూమి వేరేవారి పేరును చూపుతున్నది. కంప్యూటరీకరణ చేసే సమయంలో భూమి వేరేవారి పేరున చేశారు. కాగితాలు సక్రమంగా లేవని పాస్ పుస్తకం ఇవ్వడంలేదు. 2020 ఫిబ్రవరి నుంచి ధరణిలో ఫిర్యాదు చేసి కలెక్టరేట్‌కు తిరుగుతున్నాను. న్యాయం చేయాలని నాలుగేళ్లుగా ప్రజావాణిలో 30 సార్లు ఫిర్యాదు చేశా. ఇప్పటికీ అధికారులు సమస్యలకు పరిష్కారం చూపలేదు.


- కట్కూరి రాజు, ఐనవోలు మండలం

నేటి నుంచి ఆర్టిజన్ల రిలే దీక్షలు

హన్మకొండ: ఆర్టిజన్స్ కన్వర్షన్ చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 20 నుంచి 24 వరకు రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ ట్రాన్స్ కో వరంగల్ జోన్ చైర్మన్ బి.ఐలయ్య, కన్వీనర్లు కె.వెంకటేశ్, కె.రాజన్న తెలిపారు. ఆర్టిజన్లను సంస్థ రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర జేఏసీ పిలుపులో భాగంగా ఈ దీక్షలు చేపట్టనున్నట్లు వారు ఒక ప్రకటనలో వివరించారు. యాజమాన్యం ఇప్పటికైనా తమ న్యాయమైన డిమాండ్‌ను పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. ఆర్టిజన్లు దీక్షలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆరోగ్యశ్రీ నిధులు విడుదల చేయాలి

- టీఎన్‌హెచ్‌ఏ రాష్ట్ర ప్రతినిధులు



ఎంజీఎం: రాష్ట్రవ్యాప్తంగా పేరుకుపోయిన ఆరోగ్యశ్రీ బకాయిలు వెంటనే చెల్లించాలని తెలంగాణ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్(టీఎన్‌హెచ్‌ఏ) రాష్ట్ర ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం తెలంగాణ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ ఐఎంఏ హాల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నుంచి క్లెయిమ్స్ రానందున అన్ని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు ఈనెల 10 నుంచి ఆరోగ్యశ్రీ రోగులకు చికిత్సను నిలిపేసినట్లు తెలిపారు. సేవల్ని నిలిపేయడానికి కారణాలు తెలుపుతూ.. ఆస్పత్రులు వారి కన్సల్టేషన్ మొత్తాలను, జీతాలను చెల్లించలేనందున కన్సల్టెంట్లు పని చేయడానికి ఇష్టపడరని, ఆర్నెళ్లుగా ఆస్పత్రులు తమ మొత్తాన్ని చెల్లించలేకపోయినందున సరఫరాదారులు తమ సరఫరాలను నిలిపివేశారని, ఈనేపథ్యంలో తమ ప్రతిపాదనలను రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రికి, ఆరోగ్యశ్రీ సీఈఓ దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు కూడా అందించామని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

హలో.. ఆధార్ నంబర్ మీదేనా?

- ట్రాయ్ నుంచి ఫోన్ చేస్తున్నామని బెదిరింపు
- సీబీఐ అధికారి వాట్సాప్ డీపీతో సైబర్ మోసం
- రూ.95 వేలు పోగొట్టుకున్న మహిళ



మహబూబాబాద్ రూరల్ : హలో.. ఈ ఆధార్ నంబర్ మీదేనా? మేము ట్రాయ్ సంస్థ నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి బెదిరింపులకు పాల్పడగా భయాందోళనకు గురైన ఓ మహిళ అవతలి వ్యక్తుల మాటలు నమ్మి రూ.95 వేలు పోగొట్టుకుంది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. సీబీఐ అధికారి వాట్సాప్ డీపీతో ఉన్న ఫోన్ నంబర్ నుంచి జిల్లా కేంద్రానికి చెందిన ఓ మహిళకు ఆదివారం మధ్యాహ్నం సమయంలో ఫోన్ కాల్ వచ్చింది. తాము ట్రాయ్ సంస్థ నుంచి ఫోన్ చేస్తున్నామని పలు రకాల బెదిరింపులతో కూడిన విషయాలను మాట్లాడి, ఆధార్ కార్డు నంబర్ చెప్పి అది మీదేనా అని సదరు మహిళను అడిగారు. ఆధార్ కార్డు నంబర్ తనదేనని చెప్పడంతో సైబర్ మోసగాళ్లు తమకు డబ్బులు పంపించాలని బెదిరించారు. దీంతో భయాందోళనకు గురైన సదరు మహిళ రూ.95 వేలు ఫోన్‌పేకు బదిలీ చేసింది. కొంత సమయం తర్వాత ఆమె భర్త ఇంటికి రాగానే జరిగిన విషయాన్ని చెప్పడంతో ఆయన తన భార్య ఫోన్‌కు వచ్చిన ఫోన్ నంబర్‌కు కాల్ చేయడంతో అవతలి వ్యక్తుల నుంచి ఎలాంటి స్పందన లేదు. దీంతో సైబర్ మోసానికి గురయ్యామని భావించిన సదరు మహిళ సైబర్ క్రైం నంబర్ 1930కి ఫోన్ చేసి విషయాన్ని తెలియజేసింది. ఫిర్యాదును స్వీకరించిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందజేయమని సూచించారు. దీంతో నేడు బాధిత మహిళ మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. తమ ఆధార్ నంబర్ సైబర్ మోసగాళ్లకు ఎలా తెలిసిందని విచారం వ్యక్తం చేశారు.

జవాన్ భూమి ఆక్రమణ.. నలుగురి రిమాండ్

రఘునాథపల్లి: మండలంలోని కోమల్లలో భూఆక్రమణ కేసులో నలుగురిని రిమాండ్ చేసినట్లు రఘునాథపల్లి ఎస్సై దూదిమెట్ల నరేశ్ ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన పేరబోయిన రాజు జార్ఖండ్‌లో ఆర్మీ జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తన తండ్రి నర్సయ్య పేరు మీద గ్రామ శివారులోని చింతలగూడెంలో 409 సర్వే నంబర్‌లో 2.2 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈభూమిని ఆక్రమించాలని అదే గ్రామానికి చెందిన పేరబోయిన కొమురయ్య, పేరబోయిన రాజు, గోరంట్ల బలరాములు, మీర్జా సౌఖత్ కలిసి జవాన్ తండ్రి నర్సయ్య మరణించాడని తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించారు. 2018లో వారి పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈవిషయం తెలుసుకున్న జవాన్ ఇటీవల రఘునాథపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు తప్పుడు ధ్రువపత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించుకున్న నలుగురిని రిమాండ్‌కు తరలించగా.. న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

కుక్కల దాడిలో 80 నాటుకోళ్లు మృతి

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామానికి చెందిన బందెల వెంకటేశ్‌కు చెందిన నాటుకోళ్లు కుక్కల దాడిలో మృతి చెందాయి. బాధితుడి కథనం ప్రకారం.. ఆదివారం నాటుకోళ్లపై కుక్కలు దాడి చేయగా 80 వరకు కోళ్లు మృతి చెందాయన్నారు. వీటి విలువ సుమారు రూ.40వేల వరకు ఉంటుందన్నారు.

జాగ్రత్తలే శ్రీరామరక్ష!

పిల్లలకు యూట్యూబ్ అతిగా అలవాటు చేస్తే అనర్థమే

యూట్యూబ్.. ఆధునిక కాలంలో ఈ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ అంటే తెలియనివారు ఉండరంటే అతిశయోక్తికాదమో. ఇందులో ప్రతీ ఒక్కరికి కావాల్సిన సమాచారం వీడియో, ఆడియో రూపంలో లభిస్తుంది. ప్రధానంగా పిల్లలకు పద్యాలు, వీడియో గేమ్‌లు అధిక సంఖ్యలో అందుబాటులో ఉంటాయి. అందుకే తల్లిదండ్రులు పిల్లలకు ఫోన్‌లో పద్యాలు చూపిస్తూ యూట్యూబ్ అలవాటు చేస్తున్నారు. కానీ.. ఈ అలవాటు వల్ల భవిష్యత్‌లో జరిగే నష్టం ఆలోచించడం లేదు. యూట్యూబ్ వినియోగంలో జాగ్రత్తలు తీసుకోకపోతే పిల్లలపై దుష్ప్రభావం పడే వీలుంది. పిల్లలు అదేపనిగా యూట్యూబ్ చూస్తుంటే వారిని నియంత్రించే చర్యలేంటో తెలుసుకుందాం.



- స్క్రీన్‌కు ఎడిక్ట్ అయితే భవిష్యత్‌లో దుష్ప్రభావం
- తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలంటున్న నిపుణులు

కాజీపేట: అధిక శాతం పిల్లలు యూట్యూబ్‌లో వీడియో చూపిస్తే గానీ అన్నం తినమని మారం చేస్తుంటారు. ఆ సందర్భాల్లో తల్లిదండ్రులు ఏదోలా తింటే చాలు అని భావిస్తున్నారు. అయితే వారు తమ పిల్లలు పరోక్షంగా స్క్రీన్‌కు ఎడిక్ట్ అవుతున్నారనే విషయాన్ని గుర్తించడం లేదు. చిన్నవయసులోనే స్క్రీన్‌కు ఎడిక్ట్ అయితే భవిష్యత్‌లో దుష్పరిణామాలు తలెత్తుతాయి. వయసు పెరిగే కొద్దీ కుటుంబీకులు, స్నేహితులతో గడపడం తగ్గి, ఎప్పుడూ సోషల్ మీడియాలో గడుపుతారు. ఈ నేపథ్యంలో జాగ్రత్తగా ఉండడం మంచిదని నిపుణులు పేర్కొంటున్నారు.

ఎదిగే పిల్లలు వాడుతుంటే...

పిల్లల విషయం అలా ఉంచితే కొన్ని సందర్భాల్లో ఎదిగే పిల్లలు తల్లిదండ్రుల ఫోన్ వాడుతుంటారు. ఆ సమయంలో జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా యూట్యూబ్ వంటి అప్లికేషన్లు మెషీన్ లెర్నింగ్ అల్గారిథమ్స్ అనుసరిస్తుంటాయి. నిరంతరం ఎలాంటి వీడియోలు చూస్తుంటే వాటినే మళ్లీమళ్లీ చూపిస్తుంటాయి. సెన్సేషనల్ కంటెంట్ యూట్యూబ్‌లో చూసిన తర్వాత ఫోన్ పిల్లలకు ఇస్తే వారికి కూడా అవే వీడియోలు కనిపిస్తాయి. దీంతో వాళ్లకు కావాల్సిన ఇతర వీడియోల కోసం ప్రత్యేకంగా వెతుక్కోవాలి. ఎదిగే పిల్లలు మీ ఇంట్లో ఉంటే ఫోన్‌లో వారి కోసం సెకండ్ స్పేస్ వంటి యాప్స్ ద్వారా మరో యూట్యూబ్ ఇన్‌స్టాల్ చేసి ఇవ్వండి.

ఆన్‌లైన్‌లో కోర్సులు..

యూట్యూబ్ ఒక్కటే కాదు. యూ డెమీ వంటి అనేక పోర్టబుల్‌లో వివిధ అంశాలకు సంబంధించి ఉచిత నామమాత్రపు రుసుంతో పెయిడ్ కోర్సులు లభిస్తుంటాయి. వాటిలో ఎన్‌రోల్ అవడం ద్వారా మీ పిల్లలు చిన్న వయసులోనే అనేక అంశాలకు సంబంధించి నైపుణ్యం పెంచుకోవడానికి అవకాశం ఉంటుంది. బ్రెయిన్ పవర్, మెమరీ పెంచుకోవడం, ప్రొడక్టవిటీ, టైమ్, స్ట్రెస్ మేనేజ్‌మెంట్, పర్సనల్ డెవలప్‌మెంట్, ఆర్ట్స్, క్రాఫ్ట్‌లకు సంబంధించిన కోర్సులు లభిస్తాయి.

టైమ్ ట్రాకింగ్‌కు సరికొత్త యాప్స్...

అన్నిటికంటే సమయం విలువైంది. దీనిని ఎంత సమర్థవంతంగా వినియోగించుకోగలిగితే అంత అద్భుత ఫలితాలు సాధించొచ్చు. గంటల తరబడి కంప్యూటర్ చూసే వారు వీలైనంత ప్రొడక్టివ్‌గా ఉండేలా జాగ్రత్త వహించాలి. మనకు తెలియకుండానే టైం ఎక్కడ వృథా చేస్తున్నారో గమనించాలి. దీని కోసం అనేక టైం ట్రాకింగ్ యాప్‌లు అందుబాటులో ఉన్నాయి.

హబ్‌స్టఫ్..

ఇది వివిధ వెబ్‌సైట్లను ఓపెన్ చేసిన తర్వాత వాటిపై మనం ఎంత సమయం గడుపుతున్నామనే వివరాలు చూపిస్తుంది. ఎప్పటికప్పుడు రాండమ్ స్క్రీన్ షాట్‌లను క్యాప్చర్ చేస్తుంది. కంప్యూటర్‌లో ఏ యాప్స్ ఎక్కువ వాడుతున్నారో రిపోర్ట్ చూపిస్తుంది.

టోగెల్..

ఇది కూడా రియల్ టైం ఇంటర్నెట్‌లో మీరు స్పెండ్ చేస్తున్న వివిధ అంశాల మీద టైమ్ రిపోర్టులు చూపిస్తుంది. మీ సమయాన్ని ప్రాజెక్టులు, టాగ్‌ల ఆధారంగా ఆర్గనైజ్ చేసుకోవచ్చు. టైమ్ షీట్లను ఎక్స్‌పోర్ట్ చేసుకోవచ్చు.

హార్వెస్ట్..

మార్కెట్‌లో బాగా పాపులర్ టైం ట్రాకింగ్ సర్వీస్ ఇది. డెస్క్‌టాప్ కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్లు చివరకు స్మార్ట్‌వాచ్‌ల్లో ఇది టైమ్ ట్రాకింగ్ సదుపాయాలు అందిస్తుంది. వెచ్చించిన సమయం ఆధారంగా క్లయింట్ల నుంచి నగదు వసూలు చేసే సంస్థలకు ఇది ఉపయోగపడుతుంది.

ట్రాకింగ్ టైమ్..

గూగుల్ క్రోమ్ ఎక్స్‌టెన్షన్ రూపంలో ఇది లభిస్తుంది. రోజు మొత్తంలో సమయం ఎలా వెచ్చిస్తున్నారనే విషయాన్ని ఇది రిపోర్ట్ రూపంలో చూపిస్తుంది. మెయిన్ స్క్రీన్‌లో టాస్క్‌లను క్రియేట్ చేసుకోవచ్చు. ఎడిట్ చేయొచ్చు. కొలాబరేట్ చేయొచ్చు.

అసభ్యకర వీడియోలు రాకుండా..

ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా యూట్యూబ్‌లో కొన్నిసార్లు అసభ్యకర వీడియోలు కనిపిస్తుంటాయి. ఇవి రాకుండా ప్రత్యేకమైన సెట్టింగ్ ఉంటుంది. దీనిని ఎనేబుల్ చేయండి. మీ ఫోన్‌లో యూట్యూబ్ అప్లికేషన్ ఓపెన్ చేసి, అందులో సెట్టింగ్స్‌లో జనరల్‌లోకి వెళ్లి రొస్ట్రిక్టెడ్ మోడ్ అనే పదాన్ని ఎనేబుల్ చేయండి. దీంతో మీ ఇంట్లో ఎదిగే పిల్లలు చూడటానికి ఇబ్బందికరంగా ఉన్న వీడియోలు వాటంతట అవే డిజేబుల్ అవుతాయి.

చిన్నారులకు ప్రత్యేక వీడియోలు..

చిన్నారులను ఆకర్షించేందుకు యూట్యూబ్ గేమింగ్ థీమ్ పోర్టల్ ట్విచ్‌తో డీల్ కుదుర్చుకుంది. దీనిప్రకారం 60 ఫ్రేమ్స్ పర్ సెకండ్ వీడియోలను యూట్యూబ్ పరిచయం చేసింది. వీడియో గేమ్స్‌తో సమానమైన ఫ్రేమ్స్ యూట్యూబ్‌లో అన్ని రకాల వీడియోలు కనిపిస్తాయి. వీటి వల్ల పిల్లల మనసు ప్రభావితమవుతుంది. ఈ నేపథ్యంలో ప్రత్యేకంగా పిల్లల కోసం యూట్యూబ్ కిడ్స్ అప్లికేషన్ లభిస్తుంది. గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఇన్‌స్టాల్ చేసుకోవాలి. పిల్లలకు ఫోన్ ఇవ్వాల్సి వచ్చినప్పుడు అప్లికేషన్‌ను ఓపెన్ చేసి ఇస్తే చాలు. ఈ అప్లికేషన్‌లో వివిధ రకాల పిల్లలకు ఉపయోగపడే ఎడ్యుకేషనల్ కంటెంట్ మాత్రమే లభిస్తుంది.

స్కిల్స్ పెంచుకోవడానికి..

యూట్యూబ్‌లో కమ్యూనికేషన్ స్కిల్స్ డెవలప్ చేసుకోవడానికి వివిధ సబ్జెక్టులకు సంబంధించిన నాలెడ్జ్ పెంచుకోవడానికి తోడ్పాడే అద్భుత వీడియోలు లభిస్తాయి. మీ పిల్లలు అలాంటి వీడియోలు చూడడం ద్వారా ప్రపంచంలోని గొప్ప యూనివర్సిటీలు, ప్రొఫెసర్ల సాయంతో తమ రంగాలకు సంబంధించిన సబ్జెక్టును నేర్చుకునే అవకాశం ఉంటుంది.

యూట్యూబ్‌తో మంచీ, చెడు ఉన్నాయి



"ప్రస్తుత రోజుల్లో పిల్లలు ఆటాపాటలు వదిలి సెల్‌ఫోన్ చూడడానికే ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. యూట్యూబ్‌లో వచ్చే ప్రోగ్రామ్‌లు చూడడం అలవాటుగా మార్చుకున్నారు. ఇది సరికాదు. యూ ట్యూబ్‌తో లాభం ఎంత ఉందో..నష్టం కూడా అంతే ఉంది. చిన్న వయసులోనే స్క్రీన్‌కు అలవాటు పడితే భవిష్యత్‌లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈ విషయం గుర్తించి తల్లిదండ్రులు తమ పిల్లలను కనిపెడుతూ ఉండాలి

-డాక్టర్ పరికిపండ్ల అశోక్, మానసిక నిపుణుడు

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

మంగపేట: ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ములుగు జిల్లా మంగపేట మండలంలోని సినిమాహాల్ వీధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై టీవీఆర్ సూరి తెలిపిన వివరాల ప్రకారం... సినిమాహాల్ వీధికి చెందిన తురక శ్రీరాములు (34) గత కొంత కాలంగా మద్యానికి బానిసై అతిగా మద్యం సేవిస్తుండటంతో భార్య వీరబద్ర భర్తతో గొడవ పడి హైదరాబాద్‌కు వెళ్లిపోయింది. ఆదివారం ఉదయం శ్రీరాములు ఇంట్లో ఉరివేసుకోగా గమనించిన స్థానికులు ఉరిని తొలగించి ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు కూతుర్లు, ఇద్దరు కుమారుడు ఉన్నారు. మృతుడి బావ గుంజ వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో యువతి..



నవ్య మృతదేహం

చిట్యాల: మనస్తాపంతో ఉరి వేసుకుని యువతి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం ...జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రానికి చెందిన బుర్ర శ్రీధర్, సునీత దంపతుల కుమార్తె నవ్య (21) డిగ్రీ మొదటి సంవత్సరం వరకు చదివి మధ్యలోనే మానేసి ఇంటి వద్దనే ఉంటుంది. శనివారం రాత్రి కుటుంబ సభ్యులతో నిద్రించింది. ఆదివారం తెల్లవారు జామున మరోగదిలో పురుగుల మందు తాగి అనంతరం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేస్తుండగా అప్పటికే మృతి చెందింది. కాగా గతంలో చల్లగరిగ గ్రామానికి చెందిన సిద్దు అనే వ్యక్తి ప్రేమ పేరుతో తన కూతురు ఫొటోలను సోషల్‌మీడియాలో పోస్టులు చేస్తూ వేదిస్తున్నాడని గతంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అతనిపై కేసు నమోదు చేశారు. మళ్లీ అదే వ్యక్తి అలాగే ప్రవర్తించడంతో ఆ విషయాన్ని మనస్సులో పెట్టుకుని తమ కుటుంబ సభ్యుల పరువును తీస్తున్నాడని అప్పటి నుంచి మానసికంగా బాధపడుతున్న నవ్య ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తండ్రి శ్రీధర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

మేడారం మినీ జాతరకు సిద్ధం

- పగిడిద్దరాజు ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

గంగారం : వచ్చే నెలలో నిర్వహించే మేడారం మినీ జాతరకు సర్వం సిద్ధం చేస్తున్నామని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క అన్నారు. మహబూబాబాద్ జిల్లా గంగారం మండల కేంద్రంలో నిర్వహించిన మెగా హెల్త్ క్యాంప్‌ను మంత్రి సీతక్క ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సమ్మక్క భర్త పగిడిద్దరాజు కొలువుదీరిన పూనుగొండ గ్రామం, ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. అలాగే బయక్కపేట, కొండాయిలు, మేడారం, అయిలాపురం గ్రామాలతోపాటు గుంజేడు ముసలమ్మ జాతరలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. వచ్చే ఏడాది 2026లో జరిగే పెద్దజాతరకు ఇప్పటి నుంచి శాశ్వత పనులను చేపట్టేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ రూప్లానాయక్, మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు, మురళీధర్ రావు, ఐఎంఏ ప్రెసిడెంట్ వరంగల్ జగదీష్, రెడ్‌క్రాస్ చైర్మన్ ప్రసాద్, సీఐలు, ఎస్సైలు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చల్లా నారాయణ రెడ్డి, కొత్తగూడ, గంగారం మండలాల అధ్యక్షులు వజ్జ సారయ్య, వెంకటేశ్వర్లు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొగిలి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం దొంగల గుట్టు రట్టు

- రూ.4లక్షల విలువ చేసే ధాన్యం స్వాధీనం

నెల్లికుదురు: దొంగతనం జరిగి వారం రోజులు దాటక ముందే వరి ధాన్యం దొంగల గుట్టును రట్టు చేసి రూ.4 లక్షల విలువ చేసే ధాన్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై చిర్ర రమేశ్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మేచరాజుపల్లి గ్రామ పరిధిలో పోలీసు సిబ్బందితో పెట్రోలింగ్ చేస్తుండగా అశోక్ లేలాండ్ వాహనాన్ని తనిఖీ చేయగా వాహనంలో 50 ధాన్యం బస్తాలు ఉన్నాయి. రాయపర్తి మండలం కొత్తూరు జీపీకి చెందిన వాహన డ్రైవర్ హాలావత్ సాగర్‌ను విచారించగా కేసముద్రం మార్కెట్‌లో బానోతు రాము, బానోతు నెహ్రూలకు ధాన్యం అమ్ముతున్నట్లు చెప్పారు. వారిని పూర్తిగా విచారించగా మేచరాజుపల్లిలో 50, తొర్రూర్‌లో 20, పూసపల్లిలో 30, ఇనుగుర్తిలో 20, రాయపర్తిలో 104, మొత్తం 4 దొంగతనాల్లో 359 ధాన్యం బస్తాలను కేసముద్రంలో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. హాలావత్ సాగర్, బానోతు నెహ్రూ, రాములతో పాటు 5గురు మైనర్లు మొత్తం 8 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



ధాన్యం బస్తాలను చూపుతున్న పోలీసులు

లలితా జ్యువెల్లరీ షోరూం ప్రారంభం



షోరూంను ప్రారంభిస్తున్న ఎంపీ కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, ఎండీ కిరణ్‌కుమార్

హన్మకొండ చౌరస్తా: ప్రముఖ బంగారు, వజ్రాభరణాల షోరూం లలిత జ్యువెల్లరీ 57వ శాఖను హనుమకొండలో ఆదివారం ప్రారంభించారు. హనుమకొండలోని రాయపుర మెయిన్ రోడ్‌లో నూతన షోరూంను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, స్థానిక కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథులుగా హాజరై లలిత జ్యువెల్లరీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.కిరణ్‌కుమార్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ కావ్య మాట్లాడుతూ వ్యాపార రంగంలో హైదరాబాద్ తర్వాత వరంగల్ నగరం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. లలిత జ్యువెల్లరీ లాంటి సంస్థల ఏర్పాటుతో స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ బంగారు, వజ్రాభరణాల వ్యాపారంలో లలిత జ్యువెల్లరీ సంస్థ ఎండీ కిరణ్‌కుమార్‌ది ప్రత్యేక శైలి అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ లక్షలాది మంది ప్రజల మనసును గెలుచుకున్నారన్నారు. ప్రకటనలకు కోట్ల రూపాయలు చెల్లించాల్సిన పనిలేకుండా తానే స్వయంగా నటిస్తూ బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచారన్నారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ ఆధునిక డిజైన్లలో రూపొందించిన ఆభరణాల కోసం హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా లలిత జ్యువెల్లరీ అందుబాటులోకి తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. లలిత జ్యువెల్లరీ సంస్థ చైర్మన్, ఎండీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ తను పేద కుటుంబంలో జన్మించానని, సాధారణ వ్యక్తికి సరైన ధరల్లో నగలు కొనడమనేది ఓ పెద్ద చాలెంజ్ అనే విషయం బాగా తెలుసన్నారు. ప్రజలు కష్టపడి సంపాదించిన డబ్బు విలువ తనకు బాగా తెలుసన్నారు. అందుకోసమే కస్టమర్లకు నేను అవగాహన కల్పిస్తుంటానని కిరణ్‌కుమార్ తెలిపారు.



బంగారు ఆభరణాలను పరిశీలిస్తున్న అతిథులు

మిద్దె తోటల సాగు ఆరోగ్యదాయకం

- మానుకోట జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి మరియన్న



మిద్దె తోటల సాగును పరిశీలిస్తున్న మరియన్న

మహబూబాబాద్ రూరల్: మిద్దె తోటల సాగు ఆరోగ్యదాయకమని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి జినుగు మరియన్న అన్నారు. మిద్దె తోటలు సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న మహబూబాబాద్ పట్టణంలోని కృష్ణకాలనీకి చెందిన బానోత్ రామచందర్, సునీత నివాసంలో కూరగాయలు, పండ్ల సాగును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పలు రకాల వ్యాధుల బారి నుంచి రక్షణకు విటమిన్లు, ఖనిజ లవణాలు, పీచు పదార్థాలు మొదలైనవి అవసరమని సూచించారు. కుటుంబ అవసరాలకు సాగు చేసుకుని మంచి ఆరోగ్యం పెంపొందించుకోవాలని, రోగ నిరోధక శక్తి, కేన్సర్ రహిత సమాజం కోసం మిద్దె తోటలు సాగు చేయాలన్నారు. తాజా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు మొదలైన వాటితో పాటుగా ఔషధ మొక్కలు, పూలు తదితర వాటిని ప్రతీ ఇంటిలో పెరటి ఆవరణ, మిద్దెల మీద సాగు చేసుకోవాలన్నారు. మానుకోట జిల్లాలోని మహబూబాబాద్ పట్టణంతో పాటు తొర్రూరు, మరిపెడ, డోర్నకల్, తదితర మండల కేంద్రాల్లో మిద్దెల మీద అన్ని రకాల కూరగాయలు, ఆకుకూరలు, మునగ, కరివేపాకు, పండ్లు, పూలు, ఔషధ మొక్కలు సాగు చేస్తున్నారన్నారు.

సేంద్రియ ఎరువులు వాడుకోవాలి..

మిద్దె తోటల సాగులో ఎలాంటి రసాయన ఎరువులు, పురుగు మందులు లేకుండా కేవలం సేంద్రియ ఎరువులయిన పశువుల ఎరువు, వర్మికంపోస్ట్, వేప పిండి, వేపనూనె, కానుగ పిండి తదితర ఆర్గానిక్ ఉత్పత్తులనువాడి మిద్దె తోటలు సాగు చేస్తున్నారని తెలిపారు. ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ ద్వారా మిద్దె తోటలు పెంచేందుకు అన్నిరకాలుగా సాంకేతిక సూచనలు తెలియజేస్తున్నామన్నారు. మహబూబాబాద్ పట్టణంలో జామ, వాటర్ ఆపిల్, అవకాడో, స్టార్ ఫ్రూట్, స్వీట్ చింత, బార్బొడాస్ చెర్రీస్, మలబ్రీ, మామిడి, స్వీట్ లైమ్, దానిమ్మ, టేబుల్ నిమ్మ, బత్తాయి, మియాజకి మామిడి, పునాస మామిడి, అరటి, పైన్ ఆపిల్ (అనాస) పెంచుతున్నారని వివరించారు. అదే విధంగా బెండ, బీర, సొర, కాకర, దొండ, బోడ కాకర, టమాటా, పచ్చి మిర్చి, చిక్కుడు, దోస, పలురకాల ఆకు కూరలు, సుగంధ ద్రవ్యాలైన పసుపు, ఉల్లి, వెల్లుల్లి, అల్లం, ఔషధ మొక్కలు, పూల మొక్కలు కూడా ఇంటి అవసరాలకు అనుగుణంగా సాగు చేస్తున్నారన్నారు.

నల్లబెల్లం, పటిక స్వాధీనం

- వివరాలు వెల్లడించిన పోలీసులు

మహబూబాబాద్ రూరల్ : రైలులో అక్రమంగా తరలిస్తున్న 7 క్వింటాళ్ల నల్లబెల్లం, 75 కిలోల పటిక స్వాధీనం చేసుకుని, ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని, మరో నలుగురు అనుమానిత వ్యక్తుల కోసం గాలింపు చేస్తున్నామని మహబూబాబాద్ ఆర్పీఎఫ్ ఎస్సై సుభాని తెలిపారు. మహబూబాబాద్ రైల్వేస్టేషన్ ఆవరణలోని ఆర్పీఎఫ్ స్టేషన్ కార్యాలయంలో వరంగల్ ఆర్పీఎఫ్ ఎస్సై సుభాని ఆదివారం కేసు వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని ముతికేడ్ ప్రాంతం నుంచి పలువురు వ్యక్తులు నల్లబెల్లం, పటిక బస్తాలను నాందేడ్ నుంచి సంబల్పూర్ వైపునకు వెళ్తున్న నాగావళి ఎక్స్‌ప్రెస్ రైలులో తీసుకొస్తున్నారు. రైలు ఇంటికన్నె రైల్వే స్టేషన్‌కు చేరుకుంటున్న క్రమంలో జనరల్ బోగీ నుంచి కొందరు బెల్లం, పటిక బస్తాలను పట్టాల వెంబడి పడవేశారు. ఈ క్రమంలో అదే బోగీలో ఉన్న ప్రయాణికులు సదరు వ్యక్తులను పట్టుకోగా.. ఆ సమయంలో అక్కడికి చేరుకున్న బెల్లం, పటిక బస్తాలకు సంబంధించిన వారి బంధువులు రైలు బోగీ వద్దకు చేరుకుని ప్రయాణికులపై, రైలు బోగీపై రాళ్లు రువ్వారు. వరంగల్ ఆర్పీఎఫ్ ఎస్సై వెంకటేశ్వర్లు, జీఆర్పీ ఎస్సై సురేష్ చేరుకుని ముగ్గురు నిందితులు, 14 బస్తాల (7 క్వింటాళ్లు) నల్లబెల్లం, 3 బస్తాల (75 కిలోల) పటికను స్వాధీనం చేసుకుని మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌కు తరలించామన్నారు. ఈఘటనలో వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం చెరువుకొమ్ము తండాకు చెందిన ధరావత్ బాలు, హక్యా తండాకు చెందిన బానోతు రాజేందర్, ఇస్లావత్ తండాకు చెందిన ధరావత్ భద్రును అదుపులోకి తీసుకున్నామన్నారు. ఆ ముగ్గురితోపాటుగా చెరువుకొమ్ము తండాకు చెందిన భద్రు, శివపై కూడా కేసు నమోదు చేశామన్నారు.

160 కేజీల బెల్లం పట్టివేత

కేసముద్రం: మండల కేంద్రంలోని శివారు బ్రహ్మంగారితండా సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 160 కేజీల బెల్లం, 20 కేజీల పటిక, 5 లీటర్ల నాటు సారాను ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు గూడూరు ఎక్సైజ్ శాఖ సీఐ భిక్షపతి తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి



గోపి (ఫైల్)

రాయపర్తి: విద్యుదాఘాతంతో యువ రైతు మృతి చెందిన సంఘటన వరంగల్ జిల్లా రాయపర్తి మండలం సూర్యతండాలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన దారావత్ హన్మకు ముగ్గురు కుమారులు ఉన్నారు. తనకున్న రెండెకరాల్లో ఉమ్మడి కుటుంబంగానే వరి పొలం సాగు చేస్తున్నారు. ఆదివారం నాటు వేస్తున్న క్రమంలో చిన్న కుమారుడు ధరావత్ గోపి (28) తన బోరు మోటారుకు ఉన్న వైరు కిందకు ఉండడంతోపాటు పేలి ఉండడాన్ని గమనించలేదు. ప్రమాదవశాత్తు వైరుగోపికి తగలడంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడుకి భార్య ఉంది. గోపి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

దంతాలపల్లిలో యువకుడు..

దంతాలపల్లి: విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండల శివారు గోప్యాతండాలో ఆదివారం చోటుచేసుకుంది. తండావాసుల వివరాల ప్రకారం... బానోత్ బాలు, సరోజా దంపతుల కుమారుడు అనిల్ (16) జిల్లా ప్రజాపరిషత్ సెకండరీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం కావడంతో తల్లిదండ్రులతో కలిసి పొలం పనులు చేసి సాయంత్రం ఇంటికి వచ్చాడు. తన ఒంటిపై ఉన్న తడిబట్టలు విప్పి ఇంటి ముందు ఉన్న రేకులపై వేశాడు. ఈ క్రమంలో అనిల్‌కు విద్యుత్‌షాక్ గురై పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో తండాలో విద్యుత్ శాఖలో విధులు నిర్వహించే సురేశ్ అక్కడికి చేరుకుని సీపీఆర్ చేశాడు. అనంతరం తొర్రూరులోని ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.



అనిల్ (ఫైల్)